ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
గురువారం 31 అక్టోబరు 2024

దీపాల వేళాయె..
నేడు ఆనందాల దీపావళి
అంతటా పండగ సందడి.. చిన్నా పెద్ద సిద్ధం
6

ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలి

ఎంపీ, మంత్రి, కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు

ఏలూరుసిటీ/ఏలూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పర్వదినాన్ని ప్రజలు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని జిల్లా ప్రజలకు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దీపావళి లక్ష్మీదేవి కృపాకటాక్షాలు ప్రతి ఇంటిపై కురిసి ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. జిల్లాలోని ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య దీపావళి పండుగను జరుపుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈ పండుగ అందరి జీవితాల్లో మంచిని తీసుకురావడంతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి జరుపుకుంటామని పేర్కొన్నారు. బాణసంచా విషయంలో పిల్లల పట్ల పెద్దలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీపావళి పండుగ జిల్లా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆకాంక్షించారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి అన్నారు.

పది రూపాయల నాణేలు తీసుకోవాలి : కలెక్టర్

ఏలూరు సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రిజర్వు బ్యాంకు ఆదేశాలను అనుసరించి పది రూపాయల నాణేలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. పలు దుకాణాల వారు పది రూపాయల నాణేలు తీసుకోవడం లేదని సహాయ ఫౌండేషన్ ట్రస్టు చైర్మన్ వి.మధు కలెక్టర్‌కు విన్నవించగా స్పందించిన కలెక్టర్ చెల్లుబాటులో ఉన్న పది రూపాయల నాణేలు తీసుకోకపోతే చిల్లర సమస్య తలెత్తుతుందన్నారు. ప్రజల్లో, దుకాణదారుల్లో ఉన్న అపోహలను తొలగించాలన్నారు. ప్రజలను చైతన్యపరిచేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు.

దీపావళి.. ముసురు!


ఏలూరు నగరంలో కురుస్తున్న వర్షం

- జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు
- పోటెత్తిన గుండేటివాగు.. కొట్టుకుపోయిన ఇంజన్లు


ఏలూరులో జోరువానలో..

ఏలూరుసిటీ/ కుక్కునూరు/ ముదినే పల్లి/ ద్వారకాతిరుమల/కలిదిండి, అక్టో బరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దీపావళి ముసురు పట్టింది, బంగాళాఖాతంలో ఏర్ప డిన ఉపరితల ఆవర్తనం కారణంగా బుధ వారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షా లు కురిశాయి. ఏలూరు నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం సమయంలో భారీవర్షం కురియడంతో పల్లపు ప్రాంతా లు జలమయం అయ్యాయి. సార్వా సాగు లో వరి కోతలు మొదలయ్యాయి. ఈ సమయంలో భారీగా వర్షం కురియడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కు క్కునూరు, కొర్లకుంట, ఇసుకపాడు, లంకా లపల్లి ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో గుండేటివాగుకు భారీగా వరదనీరు వచ్చి చేరి రైతులు ఏర్పాటు చేసుకున్న ఇంజన్లు కొట్టుకు పోయాయి. ముదినేపల్లిలోని గుజర రోడ్డులో, వడాలిలో ప్రధాన రహదారి, చిగురుకోట రోడ్డు, శ్రీహరిపురం శివారు స్తంభం చెరువు వద్ద గోతుల రోడ్డులో నీరు నిలిచి ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ద్వారకా తిరుమలలో ఉదయం 11 గంటల నుంచి ఒక్కసారిగా వర్షం కుండపోతగా కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి కలిదిండిలో భారీ వర్షం కురవడంతో బస్టాప్ వద్ద రహదారి నీటమునిగి చెరువును తలపించింది.


కుక్కునూరు - దాచారం గ్రామాల మధ్య ఉధృతంగా గుండేటివాగు


ద్వారకాతిరుమలలో కురుస్తున్న భారీ వర్షం


ఏలూరు ఇండోర్ స్టేడియంలో బాణసంచా దుకాణదారుల పాట్లు

ఎంతపని చేశావ్ వాన దేవుడా !

వర్షాలకు బాణసంచా వ్యాపారం ఢమాల్

జిల్లాలో [illegible] బాణసంచా [illegible] బాణసంచా వ్యాపారులు చాలా ప్రాంతాల్లో [illegible] దీపావళి [illegible] పాటు [illegible] వ్యాపారులకు [illegible] దీపావళి [illegible] పాటు [illegible] బాణసంచా [illegible] వక్తులో [illegible] దీపావళి రోజున వ్యాపారం [illegible] గట్టెక్కుతామని, లేని పక్షంలో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

6


ద్వారకాతిరుమలలో..


ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించిన ఆదివాసీలు

జీవో 3ను పునరుద్ధరించండి

- లేనిపక్షంలో ప్రత్యేక ఉద్యోగ నియామకాల చట్టాన్ని అమలు చేయండి
- ఐటీడీఏను ముట్టడించిన ఆదివాసీలు


ఆదివాసీలను అడ్డుకుంటున్న పోలీసులు

బుట్టాయగూడెం, అక్టోబరు 30 : (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు రద్దు చేసిన జీవో నంబరు 3ను ఆదివాసీల అభివృద్ధి కోసం పునరుద్ధ రించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆది వాసీల కోసం ప్రత్యేక డీఎస్సీని ప్రకటించి ప్రత్యేక ఉద్యోగాల నియామకాల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏజెన్సీలోని ఆదివాసీలు బుధవారం కేఆర్‌పురంలోని ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏపీవో పీవీఎస్ నాయుడుకు అందజేశారు. ఆదివాసీ జేఏసీ చైర్మన్ కాకి మధు, మడకం వెంకటేశ్వరావు, మొడియం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివాసీలు పోరాడి సాధించుకున్న జీవోలను రద్దు చేయడంతో ఏజెన్సీ ప్రాంతాల్లోని కొండరెడ్డి గిరిజనులు ఉద్యోగ, ఉపాధి విషయాల్లో నష్టపోతున్నారన్నారు. జీవో నంబరు 3ను 2000లో అప్పటి టీడీపీ ప్రభుత్వమే అమల్లోకి తెచ్చిందని, చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఆదివాసీ నాయకులు కలవగా తాము అధికారంలోకి వస్తే జీవో నెం.3ను అమల్లోకి తేస్తామని హామీ ఇచ్చారని ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఐటీడీఏ పీవో, జేసీ ధాత్రిరెడ్డి వచ్చేవరకు ఆందోళన విరమించేదిలేదని భీష్మించారు. పోలీసులు పరిస్థితిని అధికారులకు వివరించడంతో జేసీ ఫోన్‌లో ఆదివాసీ నాయకులతో మాట్లాడారు. వారి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ముట్టడి విరమించారు. ఈ ముట్టడిలో నాయకులు కొమరం వెంకటేశ్వరావు, తెల్లం లక్ష్మణరావు, కుంజా కృష్ణంరాజు, రవ్వా బసవరాజు, కె.సంజీవరావు, పి.కొవ్వాడయ్య, సర్పంచ్‌లు, ఆదివాసీలు పాల్గొన్నారు.

తినలేం.. కొనలేం

మండుతున్న కూరగాయల ధరలు

కొనుగోలుదారుల బెంబేలు



ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం రాకుండానే కూర గాయల ధరలు మండిపోతున్నాయి. ఇప్పుడే ధరలు ఇలా ఉంటే కార్తీకమాసంలో అసలు కొనగలమా..? అంటూ పేద, మధ్యతరగతి ప్రజలు భయపడుతున్నారు. దీపావళి పండుగ సం దర్భంగా కూరగాయల ధరలు కొంచమైనా తగ్గుతాయని భావించిన కొనుగోలుదారులకు నిరాశే మిగిలింది. దీంతో పండుగ పూట కూడా ఇకేం తింటామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుబజారులో సైతం ధరలు మంట పుట్టిస్తున్నాయి. కిలో టమోటా రూ.38, వంకాయలు రూ.68, బెండ రూ.54, మిర్చి రూ.46, కాకర రూ.48, బీర రూ.54, క్యాబేజి రూ.36, క్యారెట్ రూ.64, దొండ రూ.44, బంగాళదుంప రూ.40, గోరుచిక్కుడు రూ.52, దోస రూ.50, బీట్‌రూట్ రూ.58, కీరదోస రూ.36, అల్లం రూ.80, ఆకాకర రూ.120, ఆనప రూ.25, పొట్లకాయ రూ.25, అరటికాయ రూ.8, కొత్తిమీర కట్ట రూ.25, గోంగూర కట్ట రూ.8, తోటకూర, పాలకూర, చుక్కకూర, మెంతుకూర కట్ట రూ. 10, పుదీనా కట్ట రూ.5, మహారాష్ట్ర ఉల్లి కిలో రూ.54 చొప్పున అమ్మకాలు జరుపుగుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో వీటికంటే అధికంగా ధరలు ఉన్నాయని కొనుగోలుదారులు వాపోతున్నారు.

కనికట్టు.. బెల్టు గుట్టు!



చీకటి మాటున వ్యాపారం

- దుకాణంలో కొని.. బయట రూ.20 పెంచి అమ్మకాలు
- కొన్నిచోట్లేమో తెరిస్తే తాట తీస్తామంటూ వార్నింగ్‌లు
- తెలంగాణ సరిహద్దున ఇంకో సీను
- ఎక్సైజ్ కంట్లో పడింది 39 బెల్టులే..

కొత్త మద్యం విధానం అమలులోకి రావడం, ప్రైవేటు వ్యక్తుల అధీనంలో మద్యం షాపులకు లైసెన్సులు ఇవ్వడం జరిగి రెండు వారాలు గడి చాయో, లేదో అక్కడక్కడ చీకటిమాటున బెల్టు షాపుల్లో విక్రయాలకు తెరతీశారు. కొన్ని చోట్ల కొందరి కనుసన్నల్లో సాగుతుండగా మరికొన్ని చోట్ల రిటైల్ మద్యం విక్రయానికి కొందరు తెర లేపారు. ఎక్సైజ్ అధికారులు కొన్ని చిల్లరమల్లర దుకాణాలపై కేసులు కట్టారు. దీపావళి తర్వాత మద్యం షాపులన్నీ కుదుటపడే అవకాశం ఉండడంతో ఆ తదుపరి బెల్టుషాపులు మరింత పెరిగి అవకాశం ఉంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

కొత్త మద్యం విధానం ప్రకారం జిల్లా వ్యాప్తంగా 144 మద్యం దుకాణాలకు రెండు వారాల క్రితమే డ్రా తీసి దుకాణదారులకు లైసెన్సు ఇచ్చారు. స్వల్ప వ్యవధిలోనే అన్నిచోట్ల విక్రయాలు ఆరంభమయ్యాయి. అదీకూడా పాత బ్రాండ్‌లు మార్కెట్‌లో అందరూ కోరుకున్నట్టుగానే కనిపించాయి. విక్రయ సమయాలు రాత్రి 10 గంటల వరకు పెంచారు. ఇంకేముంది మద్యం ప్రియులు రెచ్చిపోయారు. ఈ దెబ్బతో జిల్లా వ్యాప్తంగా ఉన్న బార్‌లన్నీ దిగొచ్చి ధరలను కొంత తగ్గించాయి. వాస్తవానికి ఇదంతా చక్కబెట్టుకోవడానికి ఆయా దుకాణాల కొత్త యజమానులకు పది రోజులే పట్టింది. కాని మద్యం వ్యాపారంలో ఆరితేరిన వారు ధైర్యంగా ముందడుగు వేసినట్టు సమాచారం. చాలాచోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎక్కడా బెల్టుకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ మధ్యనే ఒక ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఆబ్కారీ శాఖాధికార, ఇతర అధికారులను పిలిచి మాట్లాడి నియోజకవర్గంలో ఎక్కడా బెల్టు షాపులనేవి కనిపించకూడదని తేల్చేశారు. మంత్రి పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడు నియోజకవర్గంలోను బెల్టు గుట్టు ఎక్కడా ఇప్పటివరకు బయటపడలేదు. ఆయా గ్రామాల్లో బడ్డీ కొట్టులలో బెల్టు వ్యాపారానికి దిగే వారిపై గట్టి నిఘా ఉంచడమే కారణం.

తగ్గేదేలే..

ఎట్టి పరిస్థితుల్లోను బెల్టు షాపులను ప్రోత్సహించరాదన్న లక్ష్యంలో కొందరు ఉండగా, కాని ఏడాదిలోనే లక్షల ఫీజులు చెల్లించాల్సి రావాల్సి ఉన్నందున కొందరు బెల్టును ఆశ్రయించేందుకే సిద్ధపడుతున్నారు. ఎక్సైజ్ ఎట్టి పరిస్థితుల్లోనూ వీటి వ్యవహారం తేలుస్తామని చెబుతూనే ఉన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో బెల్టు షాపులు ఉన్నట్టు ఫిర్యా దులు, సమాచారం అందడంతో దాడులు చేసి 40 మందిని అరెస్టు చేశారు. ఆయా దుకా ణాలపై కేసులు పెట్టారు. అంటే ఈలెక్కన మూడో కంటికి తెలియకుండా గుట్టుగానే మద్యం విక్రయాలు పల్లెల్లో సాగుతున్నట్టు తేలుతోంది. కాని ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడింది 129 లీటర్లే. ఒక రకంగా చూస్తే జిల్లా వ్యాప్తంగా దీనిని బట్టి ఎక్కడా బెల్టు వ్యాపారమే లేదన్నట్టుగా కనిపిస్తోంది.

సరిహద్దున తీరే వేరు

తెలంగాణ సరిహద్దున ఉన్న నియోజకవర్గాల్లో సీను ఇంకోరకంగా ఉంది. కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి మండలాల్లో కొన్ని గ్రామాలకు చెందిన వారు దగ్గరలో మద్యం షాపు లేక పొరుగున ఉన్న తెలంగాణ నుంచి తెచ్చుకున్న మద్యంతో ఎంజాయ్ చేయడం లేదా వీరే స్వయంగా హద్దు దాటి వెళ్ళి అక్కడే మద్యంలో మునిగిపోవడమో జరుగుతోంది. ఈ కారణంగా కొంతలో కొంత రాష్ట్రానికి వచ్చే మద్యం ఆదాయంలో కొంత గండిపడినట్టే. చింతలపూడిలో ప్రత్యేకించి బెల్టు షాపులు లేకపోయినా కొందరు ధైర్యం చేసి వ్యక్తిగత అమ్మకాలకు దిగుతున్నట్టు సమాచారం. అంటే కేవలం కొద్దిపాటి మద్యాన్ని ఎవరు కోరుకుంటే వారికి చేర్చేందుకు సాహసం చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. జంగారెడ్డిగూడెంలోను ఇలాంటి పరిస్థితే. ఏలూరు సిటీలో ఇప్పటికే పూర్తి కట్టడి చేయడంతో బెల్టు కంటే దుకాణాల్లోనే విక్రయాలకు మద్యం ప్రియులు ఎగబడుతున్నారు. కైకలూరు నియోజకవర్గంలోను ఈ తరహా పరిస్థితులే ఉన్నాయి. అయినప్పటికీ ఇంతకుముందు మాదిరిగా బెల్టు వ్యాపారం ఏదీ ప్రత్యేకించి ఒకరో, ఇద్దరో చేసేవారు. కాని ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. ఎక్కువ మంది అందుబాటులో ఉన్న మద్యాన్ని కొనుగోలు చేయడం, దానిని రూ.10 నుంచి రూ.20 అదనంగా పెంచి విక్రయించడం జరుగుతూనే ఉంది. ప్రత్యేకించి ఒకే చోట పెద్ద సంఖ్యలో క్వార్టర్, ఫుల్ వంటి స్థాయిలో నిల్వ చేసుకుని విక్రయించేందుకు సాహసించలేకపోతున్నారు. ఈ రెండు వారాల వ్యవధిలో రాజకీయ కక్షపూరితంగా కొందరు అధికారులకు ఫిర్యాదులు చేశారని, పరిశీలనలో పెద్దగా బయటపడలేదని చెబుతున్నారు.

అదుపు తప్పితే రూ.ఐదు లక్షల అపరాధ రుసుం..

మద్యం విధానంలో నిబంధనల మేరకే వ్యవహరించాలని, ఎవరైనా అదుపు తప్పి వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని తాజాగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఏదైనా లైసెన్స్ దుకాణం పరిధిలో ఎవరైనా బెల్టు షాపు నిర్వహిస్తున్నట్టు ధ్రువపడితే తొలిసారిగా ఆ లైసెన్స్‌దారుడికి రూ.ఐదు లక్షల అపరాధ రుసుము విధిస్తామని, రెండోసారి నిగ్గు తేలితే కఠిన చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. ఈక్రమంలో మద్యం వ్యాపారులంతా సీఎం ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తారా, లేదంటే పూర్తి బెల్టుకే తెగబడతారా అనేది ఇప్పుడు అందరిలోను సందేహం. అంతకంటే మించి కూటమి పక్ష నేతలెవరూ మద్యం వ్యవహారంలో జోక్యం చేసుకోరాదని ఇంతకుముందే సీఎం హెచ్చరించారు. ఈసారి బెల్టు విషయంలోను అదే కోణంలో హెచ్చరిక ఉంది. జిల్లా వ్యాప్తంగా మద్యం విక్రయాలు ఈ పక్షం రోజుల్లో అనుకున్నంతగా పుంజుకోలేదని సమాచారం.

94910 41428

అత్యవసర కంట్రోలు రూమ్ ఏర్పాటు

ఏలూరుసిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ సందర్భంగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కలెక్టరేట్‌లో 94910 41428 నంబరుతో అత్యవసర కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. దీపావళి రోజున ఎక్కడైనా, ఏమైనా ప్రమాదాలు సంభవిస్తే కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించాలన్నారు. సంబంధిత సిబ్బంది ఆ సమాచారాన్ని ఆయా తహసీల్దార్లకు వెంటనే తెలపాలన్నారు.

ప్రమాదం జరిగితే ఫోన్ చేయండి

ఫైర్‌స్టేషన్ ఫోన్ నెంబర్లు

ఏలూరు	08812 - 230101
భీమడోలు	08829 - 222299
జంగారెడ్డిగూడెం	08821 - 225301
చింతలపూడి	08823 - 222301
నూజివీడు	08656 - 232299
కైకలూరు	08677 - 222202
కుక్కునూరు	72888 47101


ఎగసిపడుతున్న మంటలు

పేదల జీవితాలపై పిడుగు

- కొబ్బరి చెట్టుపై పిడుగు పడి.. బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటనం
- ఇద్దరి మృతి.. ఐదుగురికి తీవ్ర గాయాలు
- ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలింపు
- పొలాల్లోకి పారిపోయి ప్రాణాలు దక్కించుకున్న తొమ్మిది మంది
- సూర్యారావుపాలెంలో ఘటన.. మృతులది వెంకట్రాయపురం, రావిపాడు

7



దీపాల వేళాయె..





నేడు ఆనందాల దీపావళి

అంతటా పండగ సందడి..చిన్నా పెద్ద సిద్ధం

ఏలూరుసిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చీకటి వెలుగుల రంగేళి.. జీవితమే ఒక దీపావళి.. మన జీవితమే ఒక దీపావళి.. అంటూ పాటలు పాడుకుంటూ దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. దీపాల పండుగ దీపావళికి అంతటా సిద్ధమైంది. గురువారం రాత్రి అమావాస్య కావడంతో దీపావళి పండుగను గురువారం నాడే చేసుకోనున్నారు. ఇప్పటికే జిల్లాలో దీపావళి పండుగ సంబరాలు మొదలయ్యాయి. దీపావళి పండుగ రోజున ఉదయమే స్నానమాచరించి దేవాలయాలను సందర్శిస్తారు. నూతన వస్త్రాలు ధరించి పండుగను ఆనందోత్సాహాలతో నిర్వహించడం హైందవ సంప్రదాయంలో ప్రధానంగా కనిపిస్తుంది. రాత్రి సమయాల్లో లక్ష్మీ పూజ నిర్వహిస్తారు. పూజానంతరం దీపాలను వెలిగించి చిన్నపిల్లలచే గోంకూర కాడలతో డివిటీలు కొట్టిస్తారు. స్వీట్లు తింటారు. తర్వాత పిల్లా పెద్దా అంతా బాణసంచా కాలుస్తారు.

ఫ్యాన్సీ ఐటెమ్స్‌పై మోజు

దీపావళి పండుగ సందర్భంగా వాడవాడలా బాణసంచా దుకాణాలు వెలిశాయి.ఈ సారి బాణసంచా కొనుగోలులో ధరల భారం తప్పడం లేదని వినియోగదారులు అంటున్నారు. బ్రాండెడ్ పేరుతో ఎమ్మార్పీపై 75 నుంచి 80 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని చెబుతున్నా అవి కూడా గత ఏడాదితో పోలిస్తే ధరలు విపరీతంగా ఉన్నాయని చెబుతున్నారు. ఈ సారి వెరైటీ ప్రమిదలు మార్కెట్‌లో లభిస్తుండగా ఆన్‌లైన్‌లో నీళ్ళతో వెలుగులు నింపే ప్రమిదలు లభిస్తున్నాయి.

దీపావళి అంటేనే వెలుగుల జిమ్మే పండుగ. చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకు దీపావళి రోజున అమావాస్య రాత్రి బాణసంచా కాల్చడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో చిచ్చుబుడ్లు, మతాబులు, కాకరపువ్వొత్తులు, సిసింద్రీలు, తారాజువ్వలు, తాటాకు టపాకాయలు, భూచక్రాలు, విష్ణుచక్రాలు , ఉల్లిపాయి బాంబులు, నారబాంబులు , అగ్గిపెట్టెలు వంటివి ఎక్కువగా కాల్చేవారు. ఇప్పుడు రకరకాల ఫ్యాన్సీ ఐటెమ్స్ రంగంలోకి దిగాయి. ఎక్కువుగా షాట్స్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా ఫ్యాన్సీలో కూడా పిప్ పాప్స్ అనే అతిచిన్న ఉల్లిపాయ బాంబులను కాల్చటానికి పిల్లలు ఇష్టపడుతున్నారు. అందుకే వీటి అమ్మకాలు పెరిగాయి. ధరలు అధికమైనా ఫ్యాన్సీ ఐటెమ్స్ కొనేందుకు చిన్న పిల్లలు, యువకులు ఇష్టపడుతున్నారు.



డిష్యుం..డిష్యుం..టపాసులు

దీపావళికి మార్కెట్‌లో విభిన్న హంగులతో టపాసులు సందడి చేస్తున్నాయి. క్రికెట్ బ్యాట్, గన్ బాంబు, చేప స్టార్ ఇలా పలు రకాల టపాసులు అబ్బుర పరుస్తున్నాయి. ఈ టపాసులు కొనుగోలు చేసేందుకు చిన్నారులు ఎగబడుతున్నారు. ఈ టపాసులు అందుబాటు ధరలోనే అందించడంతో సామాన్యులు కొనుగోలుకు ఉత్సాహం చూపిస్తున్నారు.

-తాడేపల్లిగూడెం రూరల్

తిప్పుడు పొట్లం గుర్తుందా..!



ఒకప్పుడు దీపావళి అంటే నెలరోజుల ముందునుంచే ఇంటిల్లిపాదీ టపాసుల తయారీలో నిమగ్నమై ఉండేవారు. సిసింద్రీలు, తాటాకుల టాపాకాయలు, చిచ్చుబుడ్లు,మతాపులు ఇలా ఇంట్లోనే తయారు చేసుకునేవారు.రూపాయి పెట్టుబడి లేకుండా తిప్పుడు పొట్లాలు తయారు చేసుకుని రోజంతా తిప్పుతూనే ఉండేవారు. ఇప్పటి పిల్లలకు వాటి గురించి తెలియదు..తెలిసినా ఎలా చేసుకోవాలో తెలియదు. తయారుచేయడం కొద్దిగాశ్రమతో కూడుకున్నదే. తాటిచెట్లకు ఉండే చిటికెలు ఎండినవి కోసుకోవాలి. వాటిని మంటలో కాల్చిన తరువాత అవి ఆరేటప్పుడు గోతులో వేసి మట్టితో పూడ్చివేయాలి. కొంత సమయం తరువాత బొగ్గులా మారతాయి. అవి పొడుం చేసి ఆ పొడుంలో కొబ్బరి పొట్టు కలిపి పొట్లంగా తయారు చేస్తారు. దానిని ఉట్టివలే తాడు కడతారు. పొట్లం మీద నిప్పులు కొన్ని వేసి వెలిగించిన తరువాత తాడుతో తిప్పుతూ ఉంటే నిప్పు రవ్వలు మెరుపులు రౌండుగా వెలుగులు చిమ్ముతాయి

- భీమవరం రూరల్

ఎంతపని చేశావ్ వాన దేవుడా !

వర్షాలకు బాణసంచా వ్యాపారం ఢమాల్

ఏలూరు రూరల్/ భీమవరం టౌన్/గణపవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి వ్యాపారంపై వర్షం నీళ్ళు చల్లింది. బాణ సంచా వ్యాపారం మొత్తం వెలవెలపోయింది. ఒక వైపు ధరలు మండిపోతుండడంతో అసలే అంతంతమాత్రంగా ఉన్న వ్యాపారాన్ని వర్షం మరింత దెబ్బతీసింది. బుధవారం మధ్యాహ్నం నుంచి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జోరున వాన కురిసింది. ఏలూరు ఇండోర్ స్టేడియంలో 48 బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. పండుగ ఇంకా కొద్దిగంటలు మాత్రమే ఉండటంతో గురువారం జరిగే వ్యాపారం మీదనే టపాసుల వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు. పండుగ రోజు సాధారణంగా వ్యాపారం భారీగా జరిగే అవకాశాలు ఉంటాయి. కురిసిన వర్షానికి స్టేడియంలో నీరు నిలిచిపోయింది. మోటార్లతో నీటిని బయటకు తోడే ప్రయత్నం చేస్తున్నారు. దుకాణదారులు బాణసంచా తడవకుండా ఉండేందుకు నానా అవస్థలు పడ్డారు. కొన్ని దుకాణాల్లో తడిసిపోయాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని వర్షం చివరిలో ఇలా కొంపముంచిందని వ్యాపారులు వాపోతున్నారు. గురువారం వానదేవుడు కరుణిస్తే గట్టెక్కుతామని లేకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.



ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల్లోకి చేరిన వర్షపు నీరు





బాణసంచా కొనుగోలు చేసుకుని వెళుతున్న దృశ్యం





బాణసంచా తడవకుండా దుకాణదారుల అవస్థలు



దీపావళికి ముందు రోజున వర్షం కురవడంతో వ్యాపారం మందకొడిగా సాగుతోంది. ఈసారి ఎంతో నమ్మకం పెట్టుకున్నాం. అమ్మకాలు బాగుంటాయని భావించాం. వర్షం కొంత దెబ్బతీసింది.

- కొప్పుల సత్యనారాయణ, వ్యాపారి, భీమవరం



ఈసారి వ్యాపారం బాగుంటుందని భావించాం. ఇప్పటి వరకు వాతావరణం అనుకూలించినా బుధవారం రెండు సార్లు ఆకస్మాత్తుగా వర్షం పడటంతో అమ్మకాలు తగ్గిపోయాయి. దీపావళి రోజున అమ్మకాలపైనే ఆశలన్నీ.

- జబర్దస్త్ శ్రీను, భీమవరం



గతేడాది ఈ సమయానికి వ్యాపారం జోరుగా ఉండేది. ఈసారి మాత్రం అంతంతమాత్రంగానే ఉంది. వర్షం ప్రభావం బాగా కనిపించింది. గురువారం వాతావరణం అనుకూలిస్తే వ్యాపారం అనుకూలంగా ఉంటుంది.

- రావూరి ప్రసాద్, భీమవరం



పిల్లలూ.. పెద్దలూ జాగ్రత్త సుమీ

పోలవరం / భీమవరం క్రైం/ ఏలూరు క్రైం అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి ఒకసారి పిల్లల కళ్ళల్లో మెరుపులు.. ఆనందాలు చూస్తాం. జిగేల్ జిగేల్మంటూ వెలిగే దీపావళి టపాసుల మెరుపులు శబ్దాలు పిల్లలకు సంతోషాలను సంభ్రమాశ్చర్యాలను పంచుతాయి. టపాసులు కాల్చే సందర్భంలో పిల్లల కళ్లలో కనిపించే సంతోషాల కోసం పెద్దలు పరితపిస్తారు. బాణసంచా కాల్చేటప్పుడు ఆనందం ఎంత ఉంటుందో దాని వెనుక విషాదం కూడా అంతే ఉంటుంది. జాగ్రత్తలు పాటించి బాణసంచా కాల్చుకోవాలి. దీపావళి పండుగ ఆనందంగా మిగిలిపోవాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించండి..

- బాణసంచాను ఇళ్ళలో నిల్వ ఉంచరాదు. దీపపు బుడ్డి, కొవ్వత్తుల సమీపంలో సామాగ్రి ఉంచవద్దు.. బాణసంచా కాల్చే సమయంలో ప్రాథమిక చికిత్స కిట్లను, ఒక రగ్గును/దుప్పటిని దగ్గరలో ఉంచుకోవాలి. ఎలాంటి అగ్ని ప్రమాదం సంభవించినా మంటలను అదుపు చేసేందుకు బకెట్లతో నిండుగా నీటిని దగ్గరే పెట్టుకోండి.
- పిల్లలతో పాటు పెద్దలు కూడా కాటన్ దుస్తులను ధరించాలి. నిప్పు రవ్వలు రాజుకుని మంటలు వ్యాపిస్తే వెంటనే ఒంటిపై దుప్పటి లేదా రగ్గు కప్పి మంటలను అదుపు చేయవచ్చు.. వాటిని కప్పడం వల్ల మంటలకు ఆక్సిజన్ అందక పైకి మంటలు వ్యాపిం చవు. పాదరక్షలు తప్పక ధరించవలెను.
- దీపావళి సామాగ్రి కాల్చే సందర్భాలలో పెద్దలు పక్కనే ఉండి పర్యవేక్షించడం మంచిది. కొంతమంది పిల్లలు అత్యుత్సాహంతో టపాసులు కాల్చి గాయాల పాలవు తుంటారు.
- తీవ్రమైన అనారోగ్య సమస్యలలో బాధపడేవారి వద్ద ఎక్కువ శబ్ధంతో, ఒత్తిడితో పేలే బాంబులు వంటివి కాల్చవద్దు. పసి పిల్లలు, నవజాత శిశువుల చెవుల్లో దూది పెట్టడం మరచిపోవద్దు. ఎందుకంటే లేతగా ఉండే వారి కర్ణభేరి చిన్నచిన్న శబ్దాలకు కూడా ఎక్కువగా స్పందిస్తుంది
- ఇంటి ముందు లేదా మేడపైన తాటాకులు గడ్డితో వేసుకున్న నిర్మాణాలపై ముందుగా నీళ్ళు చల్లి ఉంచుకోవడం మంచిది. సమీపంలో ఎక్కడైనా ఇళ్ళు, గడ్డివాములకు నిప్పంటుకుంటే వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చేందుకు సంబంధిత నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలి.
- పిల్లల చేతికి రాకెట్, తారాజువ్వ తరహా పెద్ద వస్తువులను ఇవ్వకపోవడమే మంచిది. వయసును దృష్టిలో పెట్టుకుని పిల్లలకు పటాసులు కొనాలి. భూచక్రాలు ఇతర నేలపై మండే టపాసులు కాల్చే సందర్భాలలో బూట్లు లేదా కాలిని కవర్ చేసే విధంగా ఉండే పాదరక్షలు ధరించాలి.
- వెలిగి పేలకుండానే ఆరిపోయిన చిచ్చుబుడ్లు, లేదా బాంబుల వద్దకు వెళ్లి పరిశీలించే ప్రయత్నం చేయడం, మళ్లీ వెలిగించే ప్రయత్నం చేయవద్దు
- వంటగదులు , పొయ్యిలు, పెట్రోలు , గ్యాస్ వంటి మండే స్వభావాలున్న పదార్థాలున్న ప్రాంతాల్లో పటాసులు ఉంచడం, తడిసిన పటాసులను ఆరబెట్టే ప్రయత్నంలో వేడి చేయడానికి ప్రయత్నాలు చేయడం వంటివి చేయరాదు.
- బహుళ అంతస్తులో ఉండే ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రైవేటు సంస్థల వారు దీపావళి పండుగరోజు అన్ని కిటికీలు, తలుపులు మూసి ఉంచవలెను. బయట నుంచి తారాజువ్వలు, రాకెట్స్ వంటి వాటి వల్ల అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- ప్రభుత్వ ఆదేశానుసారం గ్రీన్ క్రాకర్స్‌ను మాత్రమే కాల్చాలి దీని వల్ల వాయు, ధ్వని కాలుష్యాన్ని తగ్గించవచ్చుప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి దీపావళి రోజు రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రమే బాణసంచా కాల్చవలెను. అగ్నిప్రమాదం సంభవిస్తే 101, 100, 108 నంబర్లకు వెంటనే ఫోన్ చేయాలి

నీటిని దగ్గరలో నిల్వ ఉంచుకోండి



బాణసంచా కాల్చేటప్పుడు బక్కెట్లతో నీటిని దగ్గరగా ఉంచుకోవాలి. ప్రమాద వశాత్తు దుస్తులకు అంటుకుంటే వెంటనే నేలపై పడి దొర్లాలి. వీలైతే గోనెపట్టాలు, దుప్పట్లు మీద వేసి మంట లను ఆర్పాలి. బాణసంచాను చేతిలో ఉంచి కాల్చడం ఎంతో ప్రమాదకరం తల్లి దండ్రులు తమ పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తగా చూసుకోవాలి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే సమీపంలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించండి. ప్రతి ఒక్కరు దీపావళి పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలి.

- రామకృష్ణ, అదనపు జిల్లా ఫైర్ ఆఫీసర్, ఏలూరు జిల్లా

దీపావళి స్పెషల్ వంటకం

గోదావరి జిల్లాల్లో నోరూరించే రామల పులుసు



దీపావళి అంటే గోదావరి జిల్లాల్లో రామల పులుసు లేనిదే ముద్ద దిగదని నానుడి. రామలు అంటే గోదావరి వాసులు అత్యంత ప్రీతిగా ఆస్వాదిస్తారు. ఈ రామలు దీపావళి అమావాస్య రోజుల్లో గోదావరి జిల్లాలో విరి విగా లభిస్తాయి. కోనసీమ, గోదావరి, కృష్ణా నదీ ప్రవాహాల్లో రామల సంతతి పెరుగుతుంది. పూర్వీకుల నుంచి రామ లను చింతకాయలతో కలిపి వంటకం తయారు చేస్తారు. వీటిలో వలకట్టు రామలకు మరీ డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు చెరువు లలో కూడా వీటిని పెంచుతున్నారు. రామలకు ఉన్న డిమాండ్ దృష్ట్యా తెలంగాణ, కర్ణాటక, రాష్ట్రాలకు కూడా ఇక్కడ నుంచి ఎగుమతి అవుతుంది. అనేక ఆయుర్వేద ఔషధ గుణాలు ఉండటంతో కిడ్నీ సమస్యలు తొలగిపోతాయని గోదావరి జిల్లాల ప్రజల నమ్మకం.. దీపావళి అమావాస్య వచ్చిందంటే చింతకాయతో వండిన రామల పులుసును తినాల్సిందే అని మనవాళ్ల చెబుతుంటారు.

- పాలకొల్లు రూరల్

సీజన్‌లో మంచి వ్యాపారం



ప్రతీ సంవత్సరం సీజన్లో మంచి వ్యాపారం జరుగుతుంది. మా హోటల్‌కు ఫోన్ ద్వారా కూడా ఆర్డర్లు వస్తూంటాయి. ఎంత ధర అయినా కొను గోలు చేయడానికి రామల ప్రియులు వెనుకాడరు. దీపావళి రోజు దొరికినన్ని రామలను కొంటాం.. వాటిని వండి రామల ప్రియులకు అందజేస్తుంటాం.

కేశవరాజు, శ్రీకన్య హోటల్, పాలకొల్లు

ఔషధ గుణాలు కలిగి ఉంటాయి



చిన్నతనంలో నానమ్మ చింత కాయలతో రామలను వండి వడ్డించేది. దీనిలో ఔషధ గుణాలు ఉన్నాయని పెద్దలు తినిపించేవారు. చిన్నతనంలో రామలు ఎక్కువగా దొరికేవి. నేడు కాలువలు కాలుష్యంగా మారడంతో అరుదుగా లభిస్తున్నాయి. దీపావళి నుంచి కార్తీక మాసం వరకు లభించే రామలను మా బంధువులు, మిత్రులకు పార్శిల్సు ద్వారా పంపుతుంటాం

వర్ధినీడి శ్రీనివాస్, పాలకొల్లు

రామల ధర పెరిగింది



ప్రతీ ఏడాది దీపావళి అమావాస్య నుంచి విక్రయించేవారం. గతేడాది సైజును మట్టి ఒక రామ రూ. 15 నుంచి 20 ఉండేది. ప్రస్తుతం రూ.30 వరకూ పెరిగిందని చెబుతున్నారు. రామలను తీసుకువచ్చి విక్రయించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాం.


వాడపల్లి శ్రీనివాస్, చేపల వ్యాపారి, పాలకొల్లు

పవిత్రం..కార్తీకం



శివ కేశవులకు ప్రీతికరమైనది అతి పవిత్రమైనది. కార్తీకమాసం. శ్రీ మహావిష్ణువు ఈ మాసంలో అన్ని జీవనదుల్లో సంచరిస్తాడని కార్తీక మాస స్నానాలాచరించడం వల్ల జన్మ జన్మల పాపాలు నశిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. దైవ సంబంధిత వృతాలు, నోములు, ఉపవాసాలు, యోగసాధనకు ఈ మాసం అనువైనది. కార్తీక మాసం నదీ స్నానం చేయడం చాలా మంచిది. మనసుకు ఆధ్యాత్మిక శక్తితో పాటు శరీరానికి మంచి ఆరోగ్యం వస్తుంది.

పోలవరం అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సూర్యోదయానికి పూర్వమే లేచి నదీస్నానం చేసి పొడి వస్త్రాలు ధరించి దీపారాధన చేయాలి. కార్తీకమాసంలో నదులు, కాల్వలు కోనేటిలో దీపాలు వదులుతారు. ఈ దీపాలు వదలడం వల్ల ఎనలేని కీర్తి సౌభాగ్యాలు కలుగుతాయని విశ్వసిస్తారు. శివాలయాలు, విష్ణాలయాల్లో ఆవు నేతితో దీపాలు వెలిగించడం వల్ల అజ్ఞాన అంధకారం తొలగి విజ్ఞాన జ్యోతులు వెలుగొందుతాయని చెబుతారు. ఈ మాసంలో బ్రాహ్మణు లకు దీప ధానం చేయడం ఉత్తమ ఫలితాన్నిస్తుంది. ఎలాంటి మంత్ర దీక్ష తీసుకున్నా గొప్ప ఫలితాలనిస్తుందని కార్తీక పురాణం చెబుతోంది. కార్తీక ఏకాదశి నుంచి కార్తీకపౌర్ణమి వరకూ ఐదు రోజుల వరకూ భీష్మపంచక వ్రతం అంటారు. ఐదు రోజులు శివుడి పంచాక్షరీ మంత్రాన్ని గానీ అష్టాక్షరీ మంత్రంతో అత్యుత్తమ ఫలితాలు ఉంటాయి. అభిషేక ప్రియుడైన శివుడికి పంచామృతాలతో అభిషేకం చేసి ఆవు నేతితో దీపం వెలిగిస్తే దారిద్ర్యం, దుఃఖం తొలగి పోతాయి. ఈ మాసంలో శివ భజనలు, అభిషేకాలు, లక్షపత్రి పూజలు కోటి బిల్వార్చనలు చేస్తారు.



కార్తీక మాసంలో తిథుల వారీగా ఆచరించవలసిన విధి విధానాలు

కార్తీక శుద్ధ పాడ్యమి : కార్తీక శుద్ధ పాడ్యమి రోజు తెల్లవారుజామున లేచి నదీ స్నానం చేయాలి. నదులు లేని చోట కనీసం స్నానం చేసే నీటిలో నదీ జలాలు కొన్ని వేసుకుని స్నానం చేసినా అదే ఫలితం దక్కుతుందని చెబుతారు. శివాలయానికి వెళ్ళి కార్తీక వ్రతం నిర్విఘ్నంగా సాగేట్లు అనుగ్రహింపమని ప్రార్థించి సంకల్పం చెప్పుకుని ఆకాశదీపాన్ని సందర్శించుకోవాలి.

విదియ : ఈరోజు తోడబుట్టిన సోదరి ఇంటికి వెళ్ళి ఆమె చేతివంట తిని ఆమెకు కానుకలు ఇచ్చి ఆశీర్వదించిన వారికి యమగండం ఉండదని పురాణాలు చెబుతున్నాయి.

తదియ : పార్వతీదేవికి స్త్రీలు కుంకుమ పూజ చేయడం ద్వారా సౌభాగ్య సిద్ధి కలుగుతుంది. మాంగల్య బలం, బంధం గట్టిపడతాయి.

చవితి : నాగుల చవితి సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరుడకి పుట్టలో పాలు పోయాలి. దీనివల్ల సంతాన యోగం, సత్సంతానం కలుగుతాయి.

పంచమి : ఈరోజుని జ్ఞాన పంచమి అని పిలుస్తారు. సుబ్రహ్మణ్యేశ్వరుడికి అర్చనలు అభిషేకాలు చేయించుకున్నవారికి కలి ప్రభావం తొలగి జ్ఞాన వృద్ధి కలుగుతుంది.

షష్టి : ఈ రోజు బ్రహ్మచారిని ఇంటికి పిలిచి భోజనం పెట్టి దక్షిణ తాంబూలాలతో కండువా దానం చేస్తే సంతాన ప్రాప్తి కలుగుతుంది.

సప్తమి : ఎర్రటి వస్త్రంలో గోధుమలు పోసి దానం ఇవ్వడం వల్ల ఆయుష్షు అభివృద్ధి జరుగుతుంది.

అష్టమి : గోపాష్టమి నాడు గోపూజ చేయడం విశేష ఫలితాన్నిస్తుంది. సమస్త దేవతా కోటి గోవులో కొలువై ఉంటారు.

నవమి :మూడు రోజుల పాటు మహా విష్ణువుని పూజించి విష్ణు సహస్రనామం పఠించాలి.

దశమి : విష్ణు సహస్రనామ పారా యణం చేసి గుమ్మడి కాయ, ఉసిరికాయ దానం చేయాలి.

ఏకాదశి : ఈ ఏకాదశికే బోధనైకాదశి అని పేరు. ఈరోజు విష్ణువుని పూజించడం వల్ల ఉత్తమ గతులు కలుగుతాయి.

ద్వాదశి : ఈరోజు క్షీరాబ్ధి ద్వాదశి .. సాయం కాలం తులసి కోటలో ఉసిరి కొమ్మను ఉంచి తులసి, ఉసిరి కల్యాణం చేయడం వల్ల సకల పాపాలు తొలగిపోతాయి.

త్రయోదశి : ఈరోజు సాలగ్రామ దానం వలన కష్టాలు పోతాయని చెబుతారు.

చతుర్దశి : శనీశ్వర ప్రీత్యర్థం ఇనుము, నువ్వులు, పత్తి దానం చేయడం వల్ల శని సంతృప్తి చెంది శుభ దృష్టిని ప్రసాదిస్తాడు.

పౌర్ణమి : కార్తీక పౌర్ణమి చాలా పవిత్రమైన రోజు. నదీస్నానం చేసి శివాలయం వద్ద జ్వాలా తోరణ దర్శనం చేసుకోవడం వల్ల సకల పాపాలు పటా పంచలవుతాయి.

పాడ్యమి : కార్తీక బహుళ పాడ్యమి రోజు ఆకు కూర దానం చేయడం వల్ల శుభ ఫలితాలు కలుగుతాయి.

విదియ : ఈ రోజు ఉసిరి వనాల్లో వనభోజనం చేయాలి.వీలు కుదరని వారి కనీసం ఉసిరి కొమ్మ పెట్టుకుని అయినా భోజనం చేయాలి.

తదియ : పండితులకు గురువులకు తులసి మాలను సమర్పించడం వల్ల ఆరోగ్యం, తెలివి తేటలు, జ్ఞానం కలుగుతుంది.

పంచమి : ఈరోజు చీమలకు నూకలు చల్లడం, శునకాలకు అన్నం తినిపించడం వల్ల శుభ ఫలితాలు కలుగుతాయి.

షష్టి : గ్రామ దేవతను పూజించడం వల్ల ఎలాంటి కీడు కుటుంబాలకు కలుగకుండా కాపాడుతారు.



సప్తమి : జిల్లేడు ఆకులతో గుచ్చిన దండను ఈశ్వరునికి సమర్పిస్తే సంపద వృద్ధి చెందుతుంది.

అష్టమి : కాలభైరవాష్టకం చదివి గారెలతో దండ చేసి కాలభైరవుడికి సమర్పించడం వల్ల ధనప్రాప్తి కలుగుతుంది.

నవమి : వెండి లేదా రాగి కలశంలో నీరు పోసి పండితునికి, బ్రాహ్మణుడికి దానం చేస్తే పితృ దేవతలు తరిస్తారు.

దశమి : మహావిష్ణువుకి ప్రీతి పాత్రమైన అన్న సంతర్పణ చేస్తే కోరికలు సిద్ధిస్తాయని ప్రతీతి.

ఏకాదశి :వైష్ణవాలయంలో దీపారాధన, పురాణ శ్రవణం, జాగరణ విశేష ఫలితాలనిస్తుంది.

ద్వాదశి : సకల దేవతారాధన శుభాన్నిస్తుంది.

త్రయోదశి : నవగ్రహారాధన చేయడం వల్ల గ్రహ దోషాలు తొలగిపోతాయి.

చతుర్దశి : మాస శివరాత్రి నాడు ఈశ్వరార్చన అభిషేకం చేయడం వల్ల అపమృత్యు దోషాలు, గ్రహ బాధలు, తొలగి పరిపూర్ణ ఆరోగ్యవంతు లవుతారు.

అమావాస్య : ఈరోజు పితృదేవతల సంతృప్తి కోసం ఎవరినైనా పిలిచి వారికి భోజనం పెట్టాలి. కుదరకపోతే బ్రాహ్మణులకు స్వయంపాకం ఇవ్వాలి.

పేదల జీవితాలపై పిడుగు

» బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడి భారీ విస్ఫోటం
» ఇద్దరి మృతి.. ఐదుగురికి తీవ్రగాయాలు





కాలిన బాణసంచా తయారీ షెడ్డు



సూర్యారావుపాలెంలో పిడుగుపడిన కొబ్బరిచెట్టు.. కాలిన గాయాలతో మహిళ

ఉండ్రాజవరం/తణుకు/పెంటపాడు అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వారంతా రోజు కూలీలు. పనికి వెళితే తప్ప పూట గడవని కుటుంబాలు. దీపావళి వేళ.. అందరి ఇళ్లల్లోనూ వెలుగులు పంచాలనుకున్నారు. కాని, వారి కుటుంబాలపై పిడుగు పడి.. చీకట్లు అలుముకున్నాయి. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో దీపావళి మందులు తయారీ చేసే షెడ్డు పక్కన వున్న కొబ్బరి చెట్టుపై బుధవారం సాయంత్రం పిడుగు పడింది. పక్కనే ఈ షెడ్డులో కార్మికులు చిచ్చు బుడ్లు, తారాజువ్వలు తయారు చేస్తున్నారు. ఈ పిడుగు కారణంగా ఇక్కడ భారీ విస్ఫోటనం సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఓ వైపు పిడుగుపాటు శబ్ధం, మరోవైపు బాణసంచా పేలుడుతో అసలు అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకునేలోగా ఇద్దరు మహిళలు కాలి బూడిదయ్యారు. మరో ఐదుగురి కాలిన గాయాలతో హాహాకారాలు చేస్తూ బయటకు పరుగులు తీశారు. అక్కడే పనిచేస్తున్న మరో తొమ్మిది మంది వెంటనే తేరుకుని ప్రాణాలు దక్కించుకునేందుకు పక్కనే వున్న పంట పొలాల్లోకి పరుగులు తీశారు. ప్రమాదంలో బాణసంచా తయారు చేస్తున్న పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన కార్మికురాలు గుమ్మడి సునీత(38), బాణసంచా తయారీ యజమాని భార్య, తణుకు మండలం వెంకట్రాయపురానికి చెందిన వేగరోతు శ్రీవల్లి(35) అక్కడక్కడే మరణించారు. దువ్వకు చెందిన కడిమి కుమారి, చుక్కా పెద్దింట్లు, పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన మందలంక కమలరత్నం, సీలం లక్ష్మి, జంగారెడ్డిగూడెంకు చెందిన విప్పర్తి వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి వచ్చిన గ్రామస్తులు వీరిని రక్షించే ప్రయత్నం చేశారు. కాలిన గాయాలతో బాధితులు హాహాకారాలు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే సుమారు గంటపాటు వర్షం పడటంతో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు ఇబ్బంది కలిగింది. ఈలోగా తహసిల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్‌ఐ గుబ్బల శ్రీనివాసరావు, సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు తన జీపులో తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోదనలతో ఆసుపత్రి ప్రాంగణం

క్షతగాత్రులను తణుకు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. క్షతగాత్రుల హాహాకారాలు, వారి బంధువుల రోదనలతో ఈ ప్రాంగణం మిన్నంటింది. వీటి మధ్యే వైద్యులు చికిత్స అందించారు. క్షతగాత్రులను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పరామర్శించారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వి.అరుణతో ఆరిమిల్లి మాట్లాడారు. అనంతరం కలెక్టర్ నాగరాణికి ఫోన్ చేసి విషయం వివరించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. బాధితులను ఆదుకుంటామన్నారు.

పొట్టకూటి కోసం వచ్చిన వారే

బాణసంచా తయారీకి వచ్చిన వారంతా నిరుపేదలే. పొట్టకూటి కోసం వచ్చిన వారే. కొందరు నెల, మరికొందరు రెండు నెలలుగా పనిచేస్తున్నారు. పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన గుమ్మడి సునీత(38), మందలంక కమల రత్నం, శీలం లక్ష్మి కొద్ది రోజులుగా రోజూ పనికి వెళ్లి వస్తూ వుంటారు. సునీతకు భర్త శ్రీను, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కమలరత్నంకు భర్త వెంకట్రావు, ఇద్దరు కుమారులు ఉండగా, లక్ష్మీకి భర్త దుర్గారావు కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాణసంచా తయారీ నిర్వాహకుడు శివకు వ్యాపారంలో తోడుగా ఉండేందుకు ఆయన భార్య శ్రీవల్లి పది రోజులుగా అక్కడకు వెళుతోంది. వీరికి కుమార్తె, కుమారుడు. కుమార్తెకు వివాహమైంది.

జేసీ ఘటనా స్థలం పరిశీలన

తణుకు మండలం వెంకట్రాయపురానికి చెందిన రామ్‌శివాజీ రెండేళ్లుగా చిచ్చుబుడ్డీలు, తారాజువ్వలు తయారు చేస్తున్నాడు. ప్రమాదం జరిగిన సమయంలో 16 మంది బాణసంచా తయారు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని జేసీ చినరాముడు, ఆర్డీవో రాణిపద్మజ పరిశీలించారు. రామ్‌శివాజీతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పనిచేసే వారంతా పేదలేనని, జీవనోపాధి కోసం దూర ప్రాంతం నుంచి ఇక్కడకు 18 మంది వచ్చి చిరు జీతానికి పనిచేస్తున్నారని చెప్పారు. కార్మికులందరికి ఇన్సూరెన్స్ చేయించినట్లు తెలిపారు. ఈ రోజు 16 మంది మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. మృత్యువు పిడుగు రూపంలో వచ్చి తన భార్య శ్రీవల్లి, మరో మహిళను కోల్పోయా మని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రమాదంలో ఇద్దరు మహిళలు మరణించడం బాధాకరమని జేసీ చెప్పారు. మృతులకు ప్రభుత్వ సహాయ సహకారాలందేలా చర్యలు తీసుకుంటామన్నారు.



తణుకు ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న ఆరిమిల్లి, శేషారావు



ఆసుపత్రిలో క్షతగాత్రులు



ధర్నాధర్నా చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, పోలీసులు

అన్నంలో పురుగులు

» నన్నయ వర్సిటీ బాలికల వసతిగృహం విద్యార్థినుల ధర్నా

రాజమహేంద్రవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బాలికల వసతిగృహంలో తమకు పురుగులతోనూ, మాడిన పదార్థాలతో పెడుతున్న భోజనం చేయలేకపోతున్నామని, మంచి భోజనం అందించాలని డిమాండ్ చేస్తూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని బాలికల వసతి గృహం విద్యార్థినులు బుధవారం ధర్నా చేశారు. వన్ వాయిస్, వన్ డిమాండ్, గుడ్‌ఫుడ్ అన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ మండుటెండలో విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. ఉదయం సుమారు 9:30 గంటల ప్రాంతంలో ఆందోళన చేపట్టడంతో ఉద్యోగులకు వర్సిటీ లోపలికి వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. కొంతమంది గేటు బయటే ఉండిపోయారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ యూనివర్సిటీ వద్దకు చేరుకున్నారు. వీసీ ఆచార్య వైశ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ సమక్షంలో విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో విద్యార్థులు, వర్సిటీ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. విద్యార్థినులు మాట్లాడుతూ తినే అన్నంలో పురుగులు వస్తున్నాయని, భోజనం సరిగా వండడంలేదని ఏకరువు పెట్టారు. రాత్రిళ్లు ఏదైనా అనారోగ్యం వస్తే చూసేందుకు ఒక నర్సు కూడా అందుబాటులో ఉండడం లేదని వాపోయారు. తినడానికి వీల్లేకుండా ఉన్న ఆహారాన్ని ఈనెల 23న వీసీకి తీసుకువెళ్లి చూపించామని, ఆయన విద్యార్థులను సద్దుమణిచే ప్రయత్నం చేశారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్సిటీలోని బాలికల వసతిగృహంలో సమస్యలు పరిష్కరించేందుకు విద్యార్థినులు, వర్సిటీ అధికారులతో రెండు కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. 24 గంటలూ ఒక నర్సు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామన్నారు. రిజిస్ట్రార్ సుధాకర్ మాట్లాడుతూ కమిటీలను వేస్తామని, కుక్‌ను మార్చాలన్న ప్రధాన డిమాండ్‌పై వీసీతో చర్చిస్తామన్నారు. వర్సిటీ అధికారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలి

» పెనుమదంలో మహిళల ధర్నా

పోడూరు, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి) : పెనుమదం చిట్టితగుంట రోడ్డులో ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ మహిళలు, స్థానికులు డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలోని మద్యం షాపు వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న మహిళలు, హైస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేశారని సమీపంలో హైస్కూల్ ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం దుకాణాన్ని ఇక్కడ నుంచి తొలగించాలని కోరుతూ అధికారులకు అనేకసార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండాపోయిందని వాపోయారు. ఇటీవల ఎన్నికల్లో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు సమస్యను తెలిపామని, ప్రభుత్వం రాగానే తొలగిస్తామని చెప్పారని అధికారంలోకి వచ్చినప్పటికీ ఇప్పటివరకు తొలగించగలేదని వాపోయారు. అనంతరం మద్యం దుకాణం లైసెన్స్‌దారుడు వచ్చి ఇక్కడ నుంచి మద్యం దుకాణాన్ని తొలగిస్తానని కొద్ది సమయం ఇవ్వాలని కోరడంతో ఆందోళనకారులు ధర్నా విరమించారు. ధర్నాలో ముచ్చర్ల సీతామహాలక్ష్మి, దేవరపు మంగతాయారు, బాలం వరలక్ష్మి, ముచ్చర్ల శ్రీనివాసరావు, గోపిశెట్టి రమేష్, కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పెనుమదంలో మద్యం షాపు వద్ద మహిళల ఆందోళన

ఉద్యాన కోర్సులకు 5న స్పాట్ మాన్యువల్ కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని ఐదు కళాశాలలు, మూడు అఫిలియేటెడ్ కళాశాలల్లో ప్రవేశానికి నవంబరు 5న స్పాట్ మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీఈఏపి సెట్-2024లో ర్యాంకు కలిగి ఇంతకు ముందే నమోదు చేసుకున్న, కొత్తగా నమోదు నమోదు చేసుకునే దరఖాస్తుదారులకు నవంబరు ఐదో తేదీ ఉదయం 9.30 నుంచి సాయంత్రం ఐదు గంటలలోపు 4వ దశ స్పాట్ మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

క్రమశిక్షణతో విద్య అభ్యసించాలి

పెంటపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని టీబీఆర్ సంస్థ చైర్మన్ తనుబుద్ది భోగేశ్వరరావు అన్నారు. అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్లో ఏలూరు 19 ఆంధ్రా బెటాలియన్ నుంచి వచ్చిన అధికారులకు ఎన్‌సీసీ విద్యార్థులకు రైఫిల్ వాడకం, ఎన్‌సీసీ లో మెలకువలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి దేశాన్ని కాపాడే సైనికు నిలా రాణించాలన్నారు. ఆంధ్రా బెటాలియన్ అధికారి వినోద్ కుమార్, కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ రవికిరణ్, ఏవో నాగ రాజు, హెచ్‌ఎం కళ్యాణి పాల్గొన్నారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

SERVICES
» ఖాళీ స్థలాలపై లోన్స్/హోమ్ లోన్స్/ప్రోపర్టీ లోన్స్/బిజినెస్ లోన్స్/పర్సనల్ లోన్స్/ టేకోవర్ లోన్స్ – 20 సం. వరకు చేయబడును. సిబిల్ అవసరం లేదు. సంప్ర: 73968 33074.
AJB -4479

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ నగదు రూపేణా చెల్లించిన /క్లెయిమ్‌లకు, దర్శ వ్యవహార మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్రైమ్ కార్నర్

బట్టలు ఆరవేస్తుండగా..

» విద్యుత్‌షాక్ తగిలి మహిళ మృతి

యలమంచిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దొడ్డిపట్ల గ్రామానికి చెందిన మంచెం భూలక్ష్మి(33) బుధవారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగలడంతో మృతి చెందినట్లు ఎస్‌ఐ కె.గుర్రయ్య తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన భూలక్ష్మి తన ఇంటిపై బట్టలు ఆరవేస్తుండగా ప్రమాదవశాత్తు తడిబట్టలు విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఉండి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఉండి హెచ్‌సీ యేషయ్య తెలిపిన వివరాలివి.. ఉండి మండలం సాగపాడుకు చెందిన అర్దాంకి నాని(44) తనకు వున్న ఆర్థిక ఇబ్బందుల వల్ల ఈనెల 24వ తేదీన ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో పురుగుల మందును తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఆయనను భీమవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్సకు విజయవాడ తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఇరువురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో యువకుడు..

ఏలూరు క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన ఓ వ్యక్తి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పాలకొల్లుకు చెందిన పెంటపాటి పోసారావు (32) ఈనెల 22 రాత్రి పాలకొల్లు వెళ్తుండగా మార్గమధ్యలో వడలి గ్రామం వద్ద మోటారు సైకిల్ అదుపు తప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలకు గురైన అతడిని తొలుత పెనుగొండ ఆ తరువాత తణుకు, ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

కంటైనర్‌ను ఢీకొన్న వ్యాన్.. ఒకరి మృతి



ఏలూరు క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై సిగ్నల్ ఇవ్వకుండా కంటైనర్ పార్కింగ్ చేయడంతో అతివేగంగా వెళ్తున్న వ్యాన్ దానిని ఢీ కొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెం దాడు. గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన దావులూరి డేవిడ్(40) వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అమలాపురం నుంచి విజయవాడకు కొబ్బరి ఈనుల చీపురు లోడుతో బుధవారం తెల్లవారుజామున వెళ్తున్నాడు. ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి దగ్గరలో 16వ నంబరు జాతీయ రహదారిపై ఒక కంటైనర్ రహదారిపైనే పార్కింగ్ చేసి సిగ్నల్ వేయకుండా ఉంచడంతో అతి వేగంగా వెళ్ళి దానిని వ్యాన్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు. కంటైనర్‌పై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యనమదుర్రు డ్రెయిన్‌లో వ్యక్తి గల్లంతు

భీమవరం క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : యనమదుర్రు డ్రెయిన్‌లో బుధవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి దూకి గల్లంతయ్యాడు. అక్కడ ఉన్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపకశాఖ సిబ్బంది, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దూకిన వ్యక్తి ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఇంకా గాలిస్తున్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మందుగుండు సామగ్రి నిల్వపై కేసు

జీలుగుమిల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దర్భగూడెంలో అక్రమంగా మందుగుండు సామగ్రి నిల్వపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పి.నవీన్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి ఓ వ్యక్తి ఇంటి వద్ద సుమారు రూ.51 వేలు విలువ గల దీపావళి టపాసులు ఉండడంతో సమాచారం అందుకున్న పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

మహిళపై హత్యాయత్నం

» ఆరుగురిని అరెస్టు చేసిన భీమవరం టూటౌన్ పోలీసులు
» దుండగుల వద్ద దొరికిన ఆధార్‌కార్డుతో గుట్టురట్టు చేసిన పోలీసులు

భీమవరం క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆమెతో ఏడడుగులు వేసి, జీవితకాలం కలిసి ఉంటానని ప్రమాణం చేశాడు. అయితే ఆమెను కడతేర్చడానికి సినిమా ఫక్కీలో పక్కాప్లాన్ వేసి పోలీసులకు చిక్కిన ఘటన భీమవరంలో జరిగింది. భీమవరం టూటౌన్ ఎస్‌ఐ ఎస్‌ఐ ఎ.ఇజ్రాయిల్ తెలిపిన వివరాలివి.. భీమవరం వంశీకృష్ణనగర్‌కు చెందిన భూపతిరాజు మధు అనే మహిళ గతంలో వివాహమై ఒక కుమారుడు ఉన్నాడు. భర్తతో విభేదాల కారణంగా కుమారుడితో కలిసి వంశీకృష్ణ నగర్‌లోనే ఐదో అంతస్తులో ఉంటున్నారు. 2013వ సంవత్సరంలో అదే ప్రాంతానికి చెందిన భూపతిరాజు ఉదయ్‌శేఖర్‌రాజుతో ప్రేమ వివాహం చేసుకున్నారు. మళ్ళీ వారికి ఓ కుమారుడు జన్మించారు. కొంతకాలం తరువాత ఇద్దరికి విభేదాలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. 2022లో భీమవరం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉదయ్‌శేఖర్‌రాజుపై అదనపు కట్నం, మరి కొన్ని కేసులు పెట్టడంతో అవి ప్రస్తుతం కోర్టులో ఉన్నాయి. ఈక్రమంలో వేర్వేరుగా ఉంటున్న మధు, ఉదయశేఖర్‌రాజు ఎవరి పని వారు చేసుకుంటున్నరు. తనపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్న భార్యను ఎలాగైనా హతమార్చాలని పక్కా ప్లాన్ చేశాడు. తన వద్ద పనిచేస్తున్న కృష్ణా జిల్లా బంటుమిల్లి గ్రామానికి చెందిన రౌడీషీటర్ కూనపురెడ్డి నాగవెంకటవీర్రాజుతో హత్య కోసం పన్నాగం చేసి రూ. 5 లక్షలు సుపారి మాట్లాడాడు. దీంతో కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన రౌడీషీటర్ కర్రా లాజర్, కొత్తగూడెం మనుగూరుకు చెందిన రౌడీషీటర్ షేక్ తర్వర్‌పాషా, గుడివాడకు చెందిన రౌడీషీటర్ గొల్లపల్లి పోతురాజు, యలమర్తి నానిలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ముందుగా వారికి రూ.20వేలు అడ్వాన్స్ ఇచ్చారు.

నిందితులను పట్టించిన ఆధార్‌కార్డు..

ఈనెల 27వ తేదీన రౌడీషీటర్లు ముగ్గురైన కర్రా లాజర్, షేక్ తర్వర్ పాషా, గొల్లపల్లి పోతురాజు, మరో వ్యక్తి యలమర్తి నాని భీమవరం చేరుకున్నారు. ముందువేసుకున్న ప్లాన్ ఆధారంగా మధ్యాహ్నం సుమారు ఒంటిగంట సమయంలో మధు ఉంటున్న అపార్ట్‌మెంట్‌పైకి వెళ్ళి ఆమెను గట్టిగా హెచ్చరించి వెంట తీసుకువెళ్ళిన కత్తితో ఆమెను పొడవబోయారు. ఆమెవారిని ప్రతిఘటించి గట్టిగా కేకలు వేయడంతో ఆ నలుగురు నిందితులు పరారయ్యారు. ఆ సమయంలో షేక్ తర్వర్ పాషా జేబులో నుంచి అతడి ఆధార్ కార్డు కింద పడింది. అది గమనించకుండా వారు వెళ్ళిపోయారు. అనంతరం తేరుకున్న మధు ఆధార్‌కార్డు ఆధారంగా ఈనెల 29వ తేదీన భీమవరం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి 24 గంటలు గడవక ముందే నిందితులైన ఉదయశేఖర్‌రాజు, నాగవెంకట వీర్రాజు, లాజర్, తర్వర్ పాషా, పోతురాజు, నానిలను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్ కాలేజియేట్‌లో ఎస్‌కేఎస్‌డీ విద్యార్థినులకు బహుమతులు

తణుకు, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో చెస్ ఉమెన్ ఇంటర్ కాలేజియేట్ యూనివర్సిటీ ఎంపికల్లో ఈనెల 26,27వ తేదీలలో భీమవరం బీవీ రాజు కళాశాలలో జరిగిన పోటీల్లో తమ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్టు ప్రిన్సిపాల్ యు. లక్ష్మీసుందరీబాయి తెలిపారు. టి.ఎస్.ఎన్ శ్రావణి, ఎం.శ్రీరమ్య, కె.జ్యోతి, ఎం.శ్రీలత, కె.వి.నాగశ్రీ, వి.హర్షిత ప్రథమ స్థానంలో నిలిచినట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులను జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు అభినందించారు. పీడీ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు సాధించిన విద్యార్థినులతో జాయింట్ సెక్రటరీ వెంకటకృష్ణారావు



పాలకొల్లు ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏజెంట్లు

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలన్నీ పరిష్కరించాలి

పాలకొల్లు, అక్టోబరు, 30 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఐసీ యాజమాన్యంతో ఏజెంట్ల సమస్యలపై చర్చలు జరిపి కొన్ని సమస్యలు పరిష్కరించినప్పటికీ మిగిలిన అన్ని సమస్యలు పరిష్కరించాలని ఎల్ఐసీ ఏజెంట్ల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం వద్ద పాలకొల్లు, నరసాపురం ఏరియా ఏజెంట్ల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో నాయకులు మాట్లాడారు. యాజమాన్యంతో ఏవోఐ నాయకులు జరిపిన చర్చల్లో అంగీకరించిన వాటితో పాటుగా మిగిలిన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాలసీలపై జీఎస్టీ తీసి వేయాలని, ఏజెంట్ల కమీషన్ పూర్వం మాదిరిగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పాలసీలపై జీఎస్టీ తీసి వేయాలని డిమాండ్‌చేస్తూ 2025 ఫిబ్రవరి 11న పార్లమెంట్ వద్ద మార్చ్ నిర్వహించాలని కేంద్ర సంఘం నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్రకమిటీ ప్రెసిడెంట్ తొట్టెంపూడి కోటేశ్వరరావు డిమాండ్ తెలిపారు. ఎండీఆర్‌టీ ఏజెంట్ ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఏజెంట్లు అందరూ ఐక్యంగా ఉండి పోరాటం చేయాలని అన్నారు. ఏజెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తొట్టెంపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ పాలసీదారుల వయస్సును 55 నుంచి 50కి తగ్గించడం న్యాయం కాదని, 55 ఏళ్లకే కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ అధ్యక్షుడు కె.ఏలియా, యు.భాస్కర రావు, జి బాలాజీ, బి.రమేష్ కుమార్, వై.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో దాసి రాజుతో కలిసి సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే నాయకర్

గోదావరి పుష్కరాలకు ముందస్తు ప్రణాళిక

» అభివృద్ధి పనులపై అధికారులతో ఎమ్మెల్యే నాయకర్ సమీక్ష

నరసాపురం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ఈసారి గోదావరి పుష్కరాలకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు అన్నిశాఖల అధికారులు ముందస్తుగా సిద్ధం చేయాలని ఎమ్మెల్యే నాయకర్ ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో దాసిరాజుతో కలిసి పలు శాఖల అధికారులతో సమీక్షించారు. 2015 పుష్కరాలకు పట్టణానికి సుమారు 50 లక్షల భక్తులు విచ్చేశారన్నారు. ఈసారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. దానికి అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పాలకొల్లు, భీమవరం, మొగల్తూరు నుంచి వచ్చే వాహనాలకు వీలుగా చేపట్టాల్సిన రహదారిపై ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. 2027లో జరిగే పుష్కరాలకు ఏడాదిన్నర ముందు నుంచే అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వానికి ముందుగా ప్రతిపాదనలు అందిస్తే ఎక్కువ నిధుల్ని మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మేకల సతీష్, కమిషనర్ అంజయ్య, డీఈ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సరిపల్లిలో టీడీపీ సభ్యత్వాలు నమోదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు

టీడీపీకి కార్యకర్తలే బలం : బండారు

నరసాపురం, అక్టోబరు30, (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు తెలిపారు. బుధవారం సరిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఈద సురేష్ ఆధ్వర్యంలో చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకునే కార్యకర్తలకు కలిగే పార్టీ సహకారాన్ని ఆయన వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అరవ రాంబాబు, మైలాబత్తుల గజశేఖర్, మైలాబత్తుల ఉమా, దేవరపు నాని, భాను, గంధం సత్యనారాయణ, మోపిదేవి శ్రీనివాస్, దాయిం బంగార్రాజు, పుప్పాల చిన్నబాబు, ధర్మకృష్ణ, రేకపల్లి సురేష్, కాంతారావు, కాజా గోపీనాథ్, రేవు ప్రభుదాస్, చాగంటి సురేష్, పి.బాలకృష్ణ సుమారు 150 సభ్యత్వాలు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక

భీమవరం అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్-13 ఓపెన్ గర్ల్స్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మాదాసు కిషోర్, గమిని రవిపవన్ ఓ ప్రకటనలో తెలిపారు.భీమవరంలోని ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో నవంబరు 3వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి పోటీలు జరుగుతాయని, పాల్గొనే వారు 01-01-2011వ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఈ పోటీలో మొదటి రెండు స్థానాలు సాధించిన క్రీడాకారులు నవంబరు 19, 20, 21 తేదీల్లో తాడేపల్లిగూడెంలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకై 9063224466 ను సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఏలూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. క్యాంప్ కార్యాలయంలో బుధవారం సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలతో కిక్కిరిసింది. ఎమ్మెల్యే వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని భరోసా కల్పించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. టీడీపీ నాయకులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగులు

చింతలపూడి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హెచ్ఐవీ ఎయిడ్స్ కంట్రోల్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ కౌన్సిలర్ యూనియన్ కార్యనిర్వాహక సభ్యుడు ఎన్.అశోక్‌బాబు, టెక్నీషియన్ యూనియన్ డి.లక్ష్మి ఎమ్మెల్యే సోంగా రోషన్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందచేశారు. ఈ సంస్థలో పనిచేస్తున్న కౌన్సిలర్స్, టెక్నీషియన్స్‌లు రెండేళ్లగా సేవలందిస్తున్నారని, అయితే జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు.

ఎంపీటీసీలకు ఆహ్వానం లేదు

కొయ్యలగూడెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాల్గొన్న కార్యక్రమాలకు ఎంపీటీసీలకు ఆహ్వానం ఉండటం లేదని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు టి.గంగరాజు అధికారులను నిలదీశారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో ఎంపీపీ జి.రామారావు అధ్యక్షతన బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు తమను పిలవడం లేదన్నారు. ఇంకా గ్రామాల్లో చెత్త పేరుకుపోతుందని, తాగునీటి సమస్యలు కన్నాపురం ఎంపీటీసీ బాజి, రాజవరం సర్పంచ్ చుక్కయ్య సభ దృష్టికి తీసుకువచ్చారు. సభలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరిగింది. వైస్ ఎంపీపీ జి.వనజాలక్ష్మి, ఎంపీటీ సీ జి.శ్రీను, ఎంపీడీఓ కిరణ్, తహసీల్దార్ చెల్లన్న దొర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

24 మందికి ఉద్యోగాలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన జాబ్ మేళాకు 74 మంది హాజరుకాగా, వీరిలో 24 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికకాగా, మరో 15 మందిని ఫైనల్ ఇంటర్వ్యూ నిమిత్తం ఎంపిక చేశారని జిల్లా ఉపాధి అధికారి మధుభూషణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

'ఉల్లాస్' నిర్వహణపై శిక్షణ

ఏలూరు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా చేపడుతున్న 'ఉల్లాస్' కార్యక్రమం బుధవారం టీటీడీసీలో జిల్లా వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. జడ్పీ సీఈవో సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో 7,321 మంది అభ్యాసకులను డీఆర్డీఏ ద్వారా గుర్తించడం జరిగిందని, వీరందరికీ 732 మంది శిక్షకుల ద్వారా మార్చి నెల వరకు క్షేత్రస్థాయిలో సాయంత్రం వేళ చదువు చెబుతాయన్నారు. డీఆర్డీఏ ఏపీఎం వేణు, వయోజన విద్య జిల్లా నోడల్ ఆఫీసర్ కేవీవీ సత్యనారాయణ, ఏపీవో విజయ్‌కుమార్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్త మార్పిడి

ఏలూరు క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో 12 మంది తలసేమియా చిన్నారులకు బుధవారం రక్తమార్పిడి చేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు క్రమంతప్ప కుండా రక్తమార్పిడి చేయాలని, రక్తదానం చేయాలని కోరారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారామ్, వైద్యులు వరప్రసాదరావు, స్పందన, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ స్వామి, కార్యదర్శులు ప్రసాద్, పీఆర్వో కేవీ రమణ పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలి

లింగపాలెం,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ప్రాథమికోన్నత పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు అన్నారు. మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అవసరమైన పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలని, సీపీఎస్ రద్దు చేసి ప్రమోషన్ల ప్రక్రియను పునరుద్ధరించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సుబ్బారావు, కె.సూర్యనారాయణ, పి.రంగారావు, బి.దర్మారావ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ జోలికి పోవద్దు

దెందులూరు, అక్టోబరు30 త(ఆంధ్రజ్యోతి) : వ్యాయామ విద్యార్థులు ర్యాగింగ్ జోలికి పోకుండా క్రమ శిక్షణతో వ్యాయామ విద్యను అభ్యసించి జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు వ్యాయామ కళాశాల అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ ఎం.నారాయణప్రసాద్(మిల్లుబాబు) అన్నారు. గోపన్నపాలెం శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ప్రిన్సి పాల్ డాక్టర్ ఎస్.నతానియాల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే నిర్వహించారు. తహసీల్దార్ సుమతి, గోపన్నపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు సీహెచ్.సుబ్బారావు, టీడీపీ నేతలు ఎం.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



ధర్మాజీగూడెంలో పొలం పిలుస్తుందిలో అధికారులు

పొలం పిలుస్తుందిలో అధికారులు

పోలవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటలు అమ్ముకునే విషయంలో దళారులను నమ్మిమోసపోవద్దని ఏవో కె.రాంబాబు అన్నారు. వింజరం, ఇటుకలకోటలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజనుకు సంబంధించి విత్తనం మొక్కజొన్న పంట పండించే రైతులు ముందస్తుగా రైతు సేవా కేంద్రంలో వివరాలు తెలియజేసి విత్తన కంపెనీల నుంచి రాతపూర్వకంగా హామీ అగ్రిమెంటు తీసుకోవాలని సూచించారు. విత్తన కంపెనీలు నాసిరకం విత్తనాలతో మోసం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

● లింగపాలెం : రైతులు కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలని ఏడీఏ లలిత సుధ అన్నారు. ధర్మాజీగూడెంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సలహాలు సూచనలు చేశారు. ఏఓ మురళీకృష్ణ పాల్గొన్నారు.

సీడ్ కంపెనీలతో జరభద్రం

సీడ్ మొక్కజొన్న పంటవేసే రైతులు సీడ్ కంపెనీ నుంచి అగ్రిమెంట్ చేసుకున్న పత్రాలు తీసుకున్న తర్వాత మాత్రమే పంట వేయాలని ఏవో మురళీకృష్ణ సూచించారు. మొక్కజొన్న పంట వేసే రైతులంతా నవంబరు ఆఖరులోగా పంట వేయాలన్నారు. కొందరు ఆర్గనైజర్లు అధిక దిగుబడుల ఆశ చూపి పంట వేయించి రైతులకు నష్టం కలిగిస్తున్నారని, అటువంటి కంపెనీల ఆర్గనైజర్లతో రైతులు అప్రమ త్తంగా ఉండాలన్నారు.

● ఏలూరు రూరల్ :వరిలో ప్రస్తుత వాతావరణ పరిస్థితిలో దోమ ఉధృతి అధికంగా ఉన్న కారణంగా నివారణ చర్యలు చేపట్టాలని, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఫణికుమార్ అన్నారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వరి పంటలో వాతావ రణం దోమకు అనుకూ లంగా మారిందన్నారు. రైతులు దోమ ఉధృతి అధికంగా ఉన్నచోట ట్రైమెత్రోజోమ్ ఎకరాకు 120 గ్రాములు లేదా ప్లెక్సాన్ 95 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. ఎంఏవో ఎ.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి : సరైన యాజమాన్యంతోనే దిగుబడులు పెరుగుతాయని ఏవో ఎం.ప్రియాంక అన్నారు. కొప్పాక, అంకన్నగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతులకు పంటల సాగులో ఆధునిక, సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించారు. మండల ఉద్యానశాఖాధికారిణి కె.రత్నమాల, రైతులు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి



ఏలూరులో వల్లభాయ్‌పటేల్‌కి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే 'ఏక్తా దివస్' కార్యక్రమాన్ని బుధవారం కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. తొలుత వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. విద్యార్థులతో జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞను చేయించారు. కళాశాల సీపీడీసీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ గిరిబాబు అధ్యాపకులు పాల్గొన్నారు.

● కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు, అధ్యాపకులు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఐక్యతా ర్యాలీ జరిపి ప్రతిజ్ఞ నిర్వహించారు. అధ్యాపకులు ఇందిరా కుమారి, డి.మల్లేష్, పి.ఏడుకొండలు, విజయకృష్ణ, ఉమా, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఐక్యతా పరుగు నిర్వహించారు. ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్, అధ్యాపకులు శ్రీనివాసరావు, శంకర సోమయ్య, ఎ.సంతోష్ పాల్గొన్నారు.

ఖోఖో జిల్లా జట్లు ఇవే..

ఉంగుటూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : కైకరం జెడ్పీ హైస్కూలులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికలలో అండర్-14, 17 బాలుర జట్టు వివరాలను అధ్యక్షుడు జి.ప్రసాదరావు ప్రకటించారు.

అండర్-17 బాలుర జట్టు

ఎస్‌డీ షరీఫ్, జి.రాజు, బి.వినయ్, డి.మౌలేష్, పి.రేవంత్ కుమార్, కె.అజయ్, బి.తేజ , ఓ.వెంకట రమణ, డి.సత్తిబాబు, బి.అజయ్ వర్ధన్, డీఎన్ ప్రకాశ్, కేడీ సత్యసాయి, ఎ.కాశి, సిహెచ్.తేజేశ్, ఎస్.తారకేశ్ ఎంపికయ్యారు.

అండర్ 17 బాలికల జట్టు

ఎన్.లక్ష్మీ వసంత, యు.నక్షత్ర, కె.హారిక, సీహెచ్.వెంకట శివాని, కె.దివ్యఎస్ సంజన, ఎస్.సింగ భవాని, కె.నవ్యశ్రీ జి.నాగ దుర్గా భవాని, డి.యామని సాయిశ్రీ ఎంపికయ్యరు.

అండర్-14 బాలుర ఖోఖో జట్టు

కె.హేమ కాశి విశ్వేశ్వరరావు, ఎం.సంపత్ కుమార్ , సిహెచ్.ఆంజనేయులు, పి.భరత్ టి.రిత్విక్, ఇ.భరత్, బి.ప్రేమ్ కుమార్, ఐ.మాధవ్ కు మార్, ఎన్.సందీప్ రెడ్డి, వి.పవన్ కుమార్ ఎంపికయ్యారు.

అండర్-14 బాలికల ఖోఖో జటు

కే.రేణుక, ఎస్.సంజన, వి.నిహారిక, బి.వి ద్యాపోశేశ్వరి, కేఎల్ఎం ప్రణతి, బి.నాగ సౌజన్య, ఎ.దేవిక, జి.సాయి కీర్తన కె.గా యత్రి, ఎన్.ఈశ్వరిసాయి పావని, కె.హరి ణి, కె.కావేరి, స్టాండ్ బైలుగా ఎ.లక్ష్మీ జ్ఞానేశ్వరి, ఎం.శ్యామల, వై.వాసవి అలేఖ్య, టి.తులసి, ఎం.శ్రీవిద్య ఎంపికయ్యారని .ప్రసా దరావు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కొమడవోలు, ఆటోనగర్ ఫీడర్‌లో ఆటోనగర్, కొమడవోలు, తూర్పులాకులు, సాయినగర్, అలాగే 11 కేవీ మాధవరం ఫీడర్‌పరిధిలో పాలగూడెం ఎస్సీకాలనీ ప్రాంతాల్లో చెట్లు నరికివేత కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆపరేషన్ సర్కిల్ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

బుట్టాయగూడెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అచ్చియ్యపాలెంలో శుక్రవారం పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి, స్వచ్ఛంద సేవా సంస్థ ఆమెన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టరు టి.గం గాధరావు తెలిపారు. ఆధునిక పరికరాలతో పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తామన్నారు.

గోదావరి రేవులు శుభ్రం

పోలవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నది తీరంలో కార్తీక మాసం పుణ్యస్నానాల కోసం బుధవారం పంచాయతీ సర్పంచ్ పి.పుష్ప పాలకవర్గ సభ్యులు ఎం.కొండ ఆధ్వర్యంలో రేవులు శుభ్రం చేయించారు. నూతనగూడెం శివాలయం రేవు యుద్ధప్రాతి పదికన సిద్ధం చేశారు.

స్వేచ్ఛాయుత వాతావరణం నెలకొంది



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతో రాష్ట్రంలో స్వేచ్ఛాయుత వాతావరణం నెలకొందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని దీపావళి కానుకగా అమలు చేస్తున్నారన్నారు తొలుత ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు బి.సుధాకర్, టి.సత్యనారాయణ, ఎం.నారాయణ ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తేమ శాతం నిబంధనలు సడలించండి

ఉంగుటూరు : తేమశాతం నిబంధనలు సడలించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు జీవీ కృష్ణారావు, జిల్లా కౌలు రైతు సంఘం కో-కన్వీనర్ వి.శ్రీరామమూర్తి కైకరంలో రైతు సహకార కేంద్రం వద్ద ఏవో ఎన్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఖరీఫ్‌లో వరి కోతల సమయంలో వర్షాలు, తుపాన్లు రావడంతో తేమ శాతం పెరిగిపోతుందని ధాన్యం ఆరబెట్టుకోవడానికి అవకాశం లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందించారు.

2న సహస్ర దీపాలంకరణ సేవ ట్రయల్ రన్

ద్వారకాతిరుమల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో తలపెట్టిన సహస్ర దీపాలంకరణ సేవకు శనివారం దేవస్థానం ట్రయల్ రన్ వేయనుంది. ఇందుకు స్వామి నిత్యకల్యాణ మండపం పక్కన ఓ మం డపాన్ని నిర్మించి ముస్తాబు చేస్తున్నారు. సహస్ర దీపాలను వెలిగించి అక్కడ ఏర్పాటు చేసిన ఊయలలో స్వామి, అమ్మవారిని ఉంచి కీర్తనలు పాడుతారు. దీనిని పూర్తిస్థాయిలో వచ్చేనెల 9న ప్రారంభించనున్నారు. ఈ ఉత్సవానికి ప్రముఖ భక్తి గాయని, ప్రద్మశ్రీ డాక్టర్ శోభారాజ్ వంద మంది శిష్యబృందంతో విచ్చేసి అన్నమాచార్య కీర్తనలను ఆలపించనున్నారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ

ద్వారకాతిరుమల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురు కులంలో రెండు రోజులు జరిగిన విజ్ఞాన శాస్త్ర ప్రద ర్శనలో సోషల్ సైన్సెస్ (హ్యూమానిటీస్) విభా గంలో స్థానిక గురుకులానికి మొదటి బహుమతి లభించిందని ప్రిన్సిపాల్ బి.రాణి తెలిపారు. భీమ డోలు గుణశ్రీ, జీఎల్ఎన్ గౌతమి మహిళా రక్షణ పై డెమో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. మహిళల పాత్ర, వరకట్నం, గృహహింస రక్షణ చట్టం, జ్యువైనల్ జస్టిస్ తదితర అంశాలను ప్రదర్శన ద్వారా చూపారు. బాలికలను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సీఆర్ఆర్‌లో ఏయూ దూర విద్యా కేంద్రం ప్రారంభం

ఏలూరు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ, పీజీ దూర విద్యా కోర్సుల విద్యార్థుల కోసం సీఆర్ఆర్ కళాశాలలో ఆంధ్ర విశ్వవి ద్యాలయం దూర విద్యా కేంద్రాన్ని ప్రారంభిం చినట్లు ప్రిన్సిపాల్ రామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మినహా మిగతా అన్ని రోజుల్లో ఆదివారంతో సహా ఉద యం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ స్టడీ సెంటర్ తెరిచి ఉంటుంద న్నారు. ఏయూ దూర విద్య కోర్సుల అడ్మిషన్లు, కాంటాక్టు తరగతులు, పరీక్షల సమాచారాన్ని విద్యార్థులు పొందవచ్చునని తెలిపారు.

విద్యార్థులూ.. వ్యసనాలకు దూరంగా ఉండండి

ఏలూరు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటే మంచి భవిష్యత్ ఉంటుందని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ అన్నారు. యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్, సైబర్‌క్రైం, సైబర్ సెక్యూరిటీ అంశాలపై బుధవారం సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. మత్తుపదార్థాల వల్ల విచక్షణకోల్పోయి దారుణాలకు ఒడిగడుతున్నారన్నారు. ర్యాగింగ్‌కు పాల్పవద్దన్నారు. డీఎస్పీ తోపాటు, మహిళా పోలీసుస్టేషన్ సీఐ సుబ్బారావును కళాశాల యాజమాన్యం సత్కరించింది. కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రామరాజు, డైరెక్టర్ వై.బాబు, ఎంబీఏ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సాగు భూమికి పట్టాలు ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గత 35 ఏళ్లుగా దళి తులు సాగు చేస్తున్న భూములకు పట్టా లు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణ డిమాండ్ చేశారు. పేరంపేటలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. పేరంపేటలో పేదలు సాగు చేసుకుంటున్న 19 ఎకరాల 60 సెంట్లు భూమికి పట్టా, పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు, రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు సీహెచ్. వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, ఉపాధ్యక్షులు కె.వసంత రావు, జి.బాలయేసు పాల్గొన్నారు.

పండుగ చేసుకునేలా లేదు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరలతో నిత్యావసర వస్తువులు కొనలేని పరిస్థితిలో ప్రజలు ఉన్నారని, దీపావళి టపాసులు కొని ఏ విధంగా పండుగ చేసుకుంటామని టీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో వాపోయారు. గతంలో ప్రభుత్వం దీపావళి, సంక్రాంతి తదితర పండుగల సందర్భంగా బెల్లం, నూనె, గోధుమపిండి, శెనగలు, పంచదార తదితర వస్తువులను ఉచితంగా ఇచ్చేవారన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఎన్‌డీఏ ప్రభుత్వం ధరలు తగ్గిస్తామని చెప్పిన హామీ అమలు చేయలేదని మండిపడ్డారు.

ఉత్సాహంగా ఉద్యోగుల ఎంపిక క్రీడా పోటీలు



ఏలూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):అల్లూరి సీతారామ రాజు స్టేడియంలో బుధవారం జరిగిన ఉద్యోగుల ఎంపిక పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ పోటీల్లో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, హాకీ, వాలీబాల్, కబడ్డీ, యోగా, స్విమ్మింగ్, మ్యూజిక్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించారు. అన్ని విభాగాల్లోని ఉద్యోగులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. పోటీల్లో విజేతలు రాష్ట్ర పోటీలకు వెళ్లటం జరుగుతుంది.

అవినీతికి తావులేకుండా ఉండాలి

భీమడోలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ శాఖలలో అవినీతికి తావులేకుండా జవాబుదారీగా ఉండాలని జిల్లా నాబార్డు మేనేజర్ అనిల్‌కాంత్ అన్నారు. కురెళ్ళగూడెంలో నాబార్డు, చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో విజిలెన్సు అవగాహన వారోత్సవాల్లో భాగంగా గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవినీతి కార్యకలాపాలు జరిగితే అవినీతి నిరోధక శాఖకు సమాచారం అందించాలన్నారు. చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు మాన్‌సింగ్, సచివాలయం కార్యదర్శి గౌతమి, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భూతగాదా.. మహిళపై దాడి

చింతలపూడి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : ప్రగడవరంలో భూతగాదా కారణంగా గోలి సరోజిని అనే వృద్ధురాలిపై బుధవారం దాడి జరిగింది. అడ్డుపడిన దివ్యాంగుడైన ఆమె కొడుకు గోలి హరిరెడ్డిపై కూడా దాడి జరిగింది. గాయపడిన సరోజినిని చింతలపూడి ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. జె.వెంకటరెడ్డి అనే వ్యక్తి తమపై దాడి చేశారని ఆరోపించారు. ఎస్ఐ కుటుంబరావు ఆస్పత్రి నుంచి వివరాలు తెలుసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ నిర్బంధం

ఉంగుటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కైకరంలో ఒక ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ ప్రతినిధు లు బుధవారం సంత మార్కెట్‌లోని ఒక మహి ళను ఇంటి నుంచి బయటకు లాగా గలాటా చేశారు. దీంతో చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం చేరవేయడంతో వారు వచ్చి ఫైనాన్స్ సిబ్బందిని స్టేషన్‌కు తీసుకువెళ్లారు. 8 నెలల క్రితం ఇదే తరహాలో వీరు హడావుడి చేయడంతో అప్పటి ఎస్ఐ మణికుమార్ వారిని హెచ్చరించి పంపేశారు.

వృద్ధుడిని కొట్టిన వ్యక్తిపై కేసు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడిని రాయితో కొట్టి గాయ పరచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలి పారు. ఈ నెల 28న పట్టణంలోని ఉప్పల మెట్ట కు చెందిన కట్టా భోగేశ్వరరావు తన కోడి పెట్టను వెతుకుతుండగా అదే ప్రాంతానికి వెళ్లిన మంగా దుర్గా ప్రసాద్ ఏరా ఎక్కడికి వెళ్తున్నావని భోగేశ్వరరావును అడిగాడు. దీంతో భోగేశ్వరరావు వయ సులో పెద్దవాడినైన తనను ఏరా అంటావా అని ప్రశ్నించగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో దుర్గాప్రసాద్ ఒక రాయి తీసుకుని భోగే శ్వరరావు తలపై,పళ్లపై బలంగా కొట్టడమే కాకుం డా నేలపై పడవేసి ఈడ్చాడు. ఈ ఘటనలో భోగేశ్వరరావుకు తీవ్ర గాయాలవగా కుటుంబ స భ్యులు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్క డి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

బోర్ల నుంచి రాగి తీగ చోరీ

ఉంగుటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : యర్రమళ్ళ గ్రామ పంట పొలాల్లో ఈ నెల 27న గుర్తుతెలియని దుండగులు కాజా జ్యోతి భార్గవికి చెందిన బోరు నుంచి రాగి తీగను దొంగి లించడంతో చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 5 కిలోల రాగి తీగను దొంగిలించినట్లు విద్యుత్ శాఖ నారాయణపురం ఏఈ బి.శ్రీరాం నాగేశ్వర స్వామి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సూర్య భగవాన్ తెలిపారు.

జాగ్రత్తలు పాటించకుంటే చర్యలు తప్పవు

బాణసంచా దుకాణాలు తనిఖీ చేసిన అధికారులు



కొయ్యలగూడెంలో దీపావళి దుకాణాలను పరిశీలిస్తున్న పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల లైసెన్సులను బుధవారం జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జి ఆర్డీవో ఎం. ముక్కంటి, డీఎస్పీ రవిచంద్ర, ఫైర్ అధికారి అబ్రహం పరిశీలించారు. లైసెన్సులు పొందింది ఒకరు దుకాణాలను నిర్వహించేది మరొకరు కావడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫైర్ ఎక్విప్‌మెంట్ పని చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. తహసీల్దార్ కె.స్లీవజోజి, మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ, ఎస్సై ఎస్‌కే జబీర్ పాల్గొన్నారు.

● లింగపాలెం : మండలంలోని బాణసంచా దుకాణాలను ఎస్ఐ వెంకన్నతనిఖీ చేశారు. టపాసుల దుకాణాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. జనావాసాలలో, తాటాకిళ్ల, గడ్డివాములవద్ద బాణాసంచా కాల్చవద్దని అన్నారు. టపాసులు కాల్చేసమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెనిపారు.


● పోలవరం : లైసెన్సులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని సీఐ బాల సురేష్‌బాబు హెచ్చరించారు. మండలంలో బుధవారం బాణసంచా దుకాణాల వద్ద భద్రతా ఏర్పాటు పరిశీలించారు. దీపావళి పండుగను ప్రమాద రహితంగా జరుపుకోవాలని అసాధారణ రీతిలో బాణాసంచా కాల్చడం ఇతరులను ఇబ్బంది పెట్టడం చేయరాదని సూచించారు.

● కొయ్యలగూడెం : మార్కెటు యార్డులోని బాణసంచా దుకాణాలను పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు పరిశీలించారు. ప్రతీ ఒక్కరు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై, సిబ్బంది, పాల్గొన్నారు.









ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై అవగాహన

నూజివీడు అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ కృత్రిమ మేథస్సుపై ఆధారపడి ఉందని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైనెన్స్ బెంగుళూరుకు చెందిన ప్రొపెసర్ విరాజ్ కుమార్ అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో అంతర్భాగంగా నడుస్తున్న శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కృత్రిమ మేథస్సుతో ఒక్కో అంశంపై రూపుదిద్దుకుంటూ ముందుకు వెళుతున్నామని భవిష్యత్ యుగం మొత్తం కృత్రిమ మేథస్సుపైనే ఆధారపడి ఉందన్నారు. అలా అని కృత్రిమ మేథస్సును గుడ్డిగా నమ్మకూడదని దానిపై పూర్తి అవగాహనతో ముందుకు వెళ్లాలన్నారు. సెంట్రల్ డీన్ శ్రావణి, ఏవో ముని రామకృష్ణ, సీఎస్ఈ డీన్ మోహన్ కృష్ణ చౌదరి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ముసునూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బలివే శ్రీ రామలింగేశ్వరస్వామి హుండీ లెక్కింపును దేవదాయధర్మదాయ శాఖ గన్నవరం తనిఖీదారు కె.అనురాధ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ ఏడాది మార్చి నుంచి బుధవారం వరకు ఆలయంలో ఉన్న నాలుగు హుండీలను లెక్కించగా రూ. లక్షా 32 వేల 191ల ఆదాయం వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈవో పి.సీతా రామయ్య, పోలీస్, రెవెన్యూ పాల్గొన్నారు.

దీపావళి రోజున జాగ్రత్తలు పాటించాలి : డీఎస్పీ

కైకలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలు దీపావళి పండుగలో బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఏలూరు డీఎస్పీ శ్రావణకుమార్ అన్నారు. కైకలూరు మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటుచేసిన బాణసంచా దుకాణాలను బుధవారం పరిశీలించారు. టౌన్ సీఐ పి.కృష్ణ పాల్గొన్నారు.

- చాట్రాయి : బాణసంచా దుకాణాల వద్ద షాపుల యజమానులు, కొనుగోలు దారులు తగిన జాగ్రత్తలు పాటించాలని నూజివీడు డీఎస్పీ ప్రసాద్ కోరారు. చాట్రాయి, చనుబండలలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను డీఎస్పీ పరిశీలించి సూచనలు చేశారు. ఎస్సై రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.
- ఆగిరిపల్లి :ఆగిరిపల్లిలోని టపాసుల దుకాణాలను నూజివీడు గఅఎస్పీ కె.ప్రసాద్ తనిఖీ చేశారు. కాగా అప్పటికీ దుకాణాలు ఎవరూ ప్రారంభించకపోవడంతో రక్షణ గురించి జాగ్రత్తలు చెప్పి జాగ్రత్తగా ఉండమని ఆదేశించి వెళ్లారు.



కైకలూరులో బాణసంచా దుకాణాలను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణకుమార్

వట్టిగుడిపాడు లోకల మందుగుండు సామాను దుకాణాన్ని కూడా సందర్శించారు. ఎస్సై శుభశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా మధ్యాహ్నం కురిసిన జోరు వానకు టపాసుల షాపుల యజమానులు లబోదిబోమన్నారు.

సేల్స్ ట్యాక్స్ అధికారుల తనిఖీలు

నూజివీడు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి మందు గుండు గోదాంలలో సేల్స్ ట్యాక్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పల్లెర్లమూడి శ్రీలక్ష్మి నారాయణ క్రాకర్స్ గోదాంలలో ఏలూరు సెక్షన్ స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.రమాకిరణ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. సేల్స్ ట్యాక్స్ అధికారులు ధనేశ్వరరావు, జోగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చాట్రాయి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరశింహారావుపాలెం రైతు సేవా కేంద్రంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నాయకులు ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దత్తు ధర అందించాలని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నదని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాధారణ రకం ధాన్యం క్వింటాల్ రూ 2300, గ్రేడ్ ఏ రకం క్వింటాల్ రూ 2320కి కొనుగోలు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో తెలుగురైతు నాయకుడు పుచ్చకాయల నేబులురెడ్డి, టీడీపీ నాయకులు తల్లాడ శ్రీనివాసరావు, కట్టా దుర్గారావు, అందే కృష్ణ రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ కృషి

ముసునూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ కృషి చేస్తుందని సీనియర్ టీడీపీ నాయకులు కె.గంగారామ్, రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైయిజింగ్ సెక్రటరీ జి.రఘుబాబు అన్నారు. గుడిపాడులో బుధవారం టీడీపీ సభ్యత్వాన్ని నాయకులు నమోదు చేశారు. టీడీపీ నాయకులు ఎం.ధర్మరాజు, పి.రామకృష్ణ, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించండి

మండవల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగనపూడి దళితుల ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభలో బాధితులు సర్వేయర్ రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముసునూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తాగునీటికి కటకట..అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో బుధవారం వచ్చిన కథనానికి పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి స్పందించారు. గోపవరం బీసీకాలనీకి నీటి సరఫరా ట్యాంకు వద్ద వాల్, పైప్‌లైన్ సమస్యను సర్పంచ్ కె.వాణి, కార్యదర్శి ఎ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పరిష్కరించారు. అయితే ఈ కాలనీకి నీరు అందించే పంచాయతీ బోరు నిరుపయోగంగా ఉందని, ఈ బోరు వినియోగంలోకి వచ్చే బీసీకాలనీలో తాగునీటి సమస్య ఉండదని మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్లినట్లు బీజేపీ నాయకులు, కాలనీవాసి కె.రాంబాబు తెలిపారు. దీనిపై మంత్రి ఎంపీడీవో రాణి, పంచాయతీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, తక్షణమే బోరు వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించినట్లు రాంబాబు తెలిపారు.

యోగా పోటీల్లో బంగారు పతకాలు

నూజివీడు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ - 19 బాలబాలికల యోగాసన పోటీల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఈ నెల 29 నుంచి అన్నమయ్య జిల్లా రాయచోటిలో యోగాసన పోటీలు నిర్వహించగా ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 12 మంది క్రీడాకారులు ట్రిపుల్ ఐటీకి చెందిన వారేనన్నారు. బాలబాలికల గ్రూప్ ఈవెంట్స్‌లో, బాలుర అథ్లెటిక్స్ విభాగం, బాలుర, బాలికల ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాల్లో బంగారు పతకాలను సాధించారన్నారు. ఏడు విభాగాల్లో బంగారు , ఒక కాంస్య, మరొక రజిత పతకాలను సాధించడం విశేషమన్నారు. ఇప్పటి వరకు తమ విద్యార్థులు వివిధ యోగా పోటీల్లో 318 పతకాలను సాధించి రికార్డులు నెలకొల్పారన్నారు. శిక్షకుడు అక్కినేని సత్య శ్రీధర్‌ను ఆయన అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ముసునూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ముసునూరు గురుకుల పాఠశాల బాలికలు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.ప్రవీణ బుధవారం తెలిపారు. ఈ నెల 28వతేదీన నిడమానూరు జడ్పీ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో అండర్-17 విభాగంలో కె.శ్రీవల్లి, మహాలక్ష్మి, శ్రావణి, అండర్-14 విభాగంలో జె.హారిక, ఎల్. అను, కె.తాప్సి ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. వీరు నవంబరు 2,3తేదీల్లో నెల్లూరు జిల్లా దర్గామిట్టాలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

కలిదిండి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మట్టగుంటలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న కటికితల జాన్ అరెస్టు చేశామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. అతడి నుంచి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కేసు నమోదు

కలిదిండి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కోరుకొల్లు అక్రమంగా దీపావళి మందుగుండు సామగ్రి తయారు చేస్తున్న చన్నంశెట్టి వెంకట సత్యనారాయణ,చలమలశెట్టి సతీష్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. వీరి వద్ద నుంచి మందుగుండు సామగ్రి, టపాసులు స్వాధీనం చేసుకున్నా మన్నారు.



















